సాక్షి
సూర్యాపేట
గురువారం, 9, మార్చి, 2023



నకిలీ బంగారంతో మోసాలు
నకిలీ బంగారాన్ని అంటగడుతూ మోసం చేస్తున్న రెండు అంతర్‌రాష్ట్ర ముఠాలను పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



అముదను ఆదుకోరూ..!
క్యాన్సర్‌తో బాధపడుతున్న అముదకు వైద్యం చేయించడానికి దాతలు ఆపన్నహస్తం అందించాలని కోరుతున్నారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 36°/20°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా న్యాయమూర్తులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చివ్వెంల(సూర్యాపేట) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్ అన్నారు. బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎదైనా సమస్య ఎదురైతే చట్టం ద్వారా పోరాడాలి గానీ ఆత్మహత్యలకు పాల్పవద్దని కోరారు. ఈ సందర్భంగా మహిళా న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీవాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కోదాడలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ: కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఐదు పడకలతో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. కోదాడ ప్రాంతంలోని కిడ్నీ రోగులకు ఈ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైద్యులు, సిబ్బంది సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కోదాడ ఎంపీపీ చింతా కవిత, కౌన్సిలర్ కమదనం చందర్‌రావు, కనగాల జనార్దన్ రావు, వైద్యశాల సూపరింటెండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను తరిమికొట్టాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మతోన్మాద శక్తులను తరిమికొట్టాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సంఘం రాష్ట్ర నాయకురాలు అనంతుల మల్లీశ్వరి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఉస్తెల సృజన మాట్లాడుతూ నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్లుగా వంటింటికే పరిమితమైన మహిళలు ఇప్పుడిప్పుడే ఇంటి గడప దాటి అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఎందరో మహిళలు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. నేటి సమాజంలో మహిళలు లేని రంగం అంటూ ఏదీ లేదని, సమాజంలో వారు వివక్షను ఎదుర్కొంటున్నారని, రోజురోజు మహిళలపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పతల కోటమ్మ, దేవరం మల్లీశ్వరి, సాతులూరు అలివేలు, జయసుధ, రేణుక ఎల్లమ్మ, భాగ్య, లచ్చమ్మ, సుజాత, సుగుణమ్మ, సువర్ణ, రచన పాల్గొన్నారు.

ఐదు పల్లె దవాఖానాలకు వైద్యుల నియామకం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని ఐదు పల్లె దవాఖానాలకు (ఆరోగ్య ఉపకేంద్రాలు) బుధవారం వైద్యులను నియమించారు. అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో ఉండే జాజిరెడ్డిగూడెం దవాఖానాకు డాక్టర్ నగేష్, కాసర్లపహాడ్‌కు డాక్టర్ గౌతమి, కొమ్మాలకు డాక్టర్ వర్షిత, కోడూరుకు డాక్టర్ సంధ్యారాణి, తిమ్మాపురానికి డాక్టర్ జి.వాణి నియమితులయ్యారు. కాగా జాజిరెడ్డిగూడెం పల్లె దవాఖానా డాక్టర్ నగేష్‌ను తాత్కాలికంగా నాగారం పీహెచ్‌సీకి డిప్యుటేషన్ వేశారు.

అద్దె దోపిడీ!

కార్యాలయాలు లేకున్నా అద్దె పేరిట బిల్లులు

- బిల్లుల కోసం వెలుస్తున్న బోర్డులు
- మండల కేంద్రాల్లో నెలకు రూ.8వేలు, నియోజకవర్గ కేంద్రాల్లో నెలకు రూ.12వేలు స్వాహా
- ఇరిగేషన్ శాఖలో రెండేళ్లుగా సాగుతున్న తతంగం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఇదీ తిరుమలగిరిలో తాత్కాలికంగా వెలిసిన ఇరిగేషన్ శాఖ కార్యాలయం.. కేవలం బిల్లుల కోసమే బోర్డు వెలిసినట్లు సమాచారం. కార్యాలయం లేకున్నా ఉన్నట్లు అధికారులకు చూపేందుకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వారు ఒక భవనాన్ని ఎంచుకొని బోర్డు ఏర్పాటు చేశారు. ఇదీ ఇరిగేషన్‌శాఖలో అద్దెల పేరిట బిల్లుల స్వాహా పర్వానికి నిదర్శనం.

సూర్యాపేట : ఆ శాఖ కార్యాలయాలు ఎక్కడున్నాయో తెలియదు. మండల కేంద్రాలకు వెళ్లి వెతికినా కనడబవు. కానీ కార్యాలయాల అద్దె పేరుతో బిల్లులలు పుట్టుకొస్తాయి. ఈ సమయంలో మాత్రం ఏదో ఒక భవనం ముందు కార్యాలయాల బోర్డులు దర్శనమిస్తాయి. ఇదీ జిల్లా ఇరిగేషన్‌శాఖలో రెండేళ్లుగా సాగుతున్న అద్దె దోపిడీ తీరుకు నిదర్శనం. రైతుల సౌలభ్యం కోసం డివిజన్, మండలాల్లో ఏర్పాటు చేయాల్సిన కార్యాలయాలు కేవలం పేపర్లపైనే కనిపిస్తాయి.

సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని..
నీటిపారుదల ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువలు, చెరువులు, ఇతర జలాలతో సహా అన్ని నీటి వనరులను కవర్ చేసే ప్రాదేశిక అధికార పరిధిని సరిహద్దులతో, నీటి పారుదల వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు 2021 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా జిల్లాలో గోదావరి జలాలు ప్రవహించే పరిధిలోని సబ్ డివిజన్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎస్సారెస్పీ ద్వారా జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో సాగు నీటిని అందిస్తుండగా తిరుమలగిరి మండలంలో ప్రారంభమై కోదాడ మండలంలోనికి గోదావరి జలాలు చేరుకుంటాయి. ఈ నీటి నియంత్రణ కోసం జిల్లాలో తిరుమలగిరి, సూర్యాపేట రెండు డివిజన్లను ఏర్పాటు చేశారు. తిరుమలగిరి డివిజన్ పరిధిలో మోత్కూరు, నాగారం, తిరుమలగిరి, తుంగతుర్తి, నూతనకల్ సబ్‌డివిజన్‌లను ఏర్పాటు చేయగా సూర్యాపేట పరిధిలోని సూర్యాపేట, ఆత్మకూర్ (ఎస్), మోతె, చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాల్లో సబ్ డివిజన్‌లను ఏర్పాటు చేశారు. ఈ రెండు డివిజన్ల పరిధిలో ఒక్కో డివిజన్‌కు 5 సబ్ డివిజన్‌లు ఏర్పాటు కాగా.. ఒక్క సబ్ డివిజన్ కింద 30వేల నుంచి 35వేల ఎకరాల వరకు నీటిని అందించే దిశగా ప్రణాళిక చేశారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో డిప్యూటీ ఇంజనీరు కార్యాలయం ఏర్పాటు చేసి విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు రెండేళ్ల క్రితం ఆదేశాలు జారీ చేశారు.

కనిపించని కార్యాలయాలు

సబ్ డివిజన్‌లను ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉండగా అధికారులు పేపర్లపైనే కార్యాలయాలు ఉన్నట్లు చూపుతున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం ఎంత వెతికినా వాటి జాడ కనబడదు. సూర్యాపేట పరిధిలోని సబ్ డివిజన్ ఆఫీసులు జిల్లా కేంద్రంలో సర్కిల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసి ఇక్కడి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఆత్మకూరు(ఎస్) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సబ్ డివిజన్ కార్యాలయం నామమాత్రంగా ప్రారంభించి ఫొటోను పై అధికారులకు పంపించి కార్యాలయం లేకుండానే ఉన్నట్లు చూపిస్తున్నారు. తుంగతుర్తి, నాగారం, మోతె, నూతనకల్‌లలో కార్యాలయాలు లేకున్నా .. అద్దె కోసం బిల్లులు పెట్టుకునే సమయంలోనే మండలంలో ఒక భవనం ముందు బోర్డు ఉంచి కార్యాలయంగా చూపుతున్నారు. మండల కేంద్రాల్లో నెలకు రూ. 8 వేలు , నియోజకవర్గ కేంద్రాల్లో రూ.12వేలు అద్దె కోసం బిల్లులు పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. రెండు సంవత్సరాలుగా అద్దె బిల్లులు పెట్టినట్లు సమాచారం.

ఆడబిడ్డలకు అండ కేసీఆర్



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల, కలెక్టర్

- మహిళా హక్కులు, రక్షణలో దేశానికే తెలంగాణ ఆదర్శం
- జిల్లా కేంద్రంలో మహిళా దినోత్సవంలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : ఆడబిడ్డలకు అండగా ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి, కేసీఆర్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన మంత్రి ప్రభుత్వ, ప్రైవేట్, రాజకీయ రంగాల్లో రాణిస్తున్న మహిళా మణులను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు అనుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని వారికి కావాల్సింది ప్రోత్సాహం మాత్రమే అని అన్నారు. అందుకే అన్ని రంగాల్లో మహిళలకు కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహిళా హక్కులు, రక్షణ విషయంలో భారత దేశానికే తెలంగాణ రాష్ట్రం నమూనాగా మారిందన్నారు. కల్యాణలక్ష్మితో ఆర్థిక భరోసాతో పాటు బాల్య వివాహాలకు చెక్ పెట్టిన మహిళా రక్షకుడు కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్ నిర్ణయంతో వచ్చిన షీ టీమ్స్‌తో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయన్నారు. అనంతరం జిల్లాలో ఉన్న 14,201 మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ. 750 కోట్ల చెక్‌ను మంత్రి అందజేశారు. ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బాగుంటేనే కుటుంబాలు బాగుంటాయని నమ్మే నాయకుడు కేసీఆర్ అని అన్నారు. కలెక్టర్ ఎస్. వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.









వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉండాలనేదే కేసీఆర్ ఆకాంక్ష

ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉండాలనేదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళా పథకాన్ని మంత్రి ప్రారంభించిమాట్లాడారు. ఈ పథకంలో 8 రకాల చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ లింగయ్యయాదవ్, కలెక్టర్ వెంకట్రావు, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉప్పల ఆనంద్, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, బైరు వెంకన్నగౌడ్, జీడి భిక్షం పాల్గొన్నారు.



ఆరోగ్య మహిళా సేవలను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్

రైతుకు మరింత సహకారం

- సహకార సంఘాల విస్తరణకు కసరత్తు
- వ్యవసాయ క్లస్టర్ల వారీగా ఏర్పాటుకు అధికారుల ప్రణాళిక
- జనాభా, సాగు విస్తీర్ణం, రైతుల వివరాల సేకరణపై దృష్టి



తుంగతుర్తిలోని పీఏసీఎస్ కార్యాలయం


పంచాయతీలు	475
వ్యవసాయ క్లస్టర్లు	82
పీఏసీఎస్‌లు	47
సభ్యులు	1,09,890

నాగారం : సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు దేశంలో వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో జిల్లాలో కొత్తగా మరిన్ని పీఏసీఎస్‌లు ఏర్పాటయ్యే అవకాశముంది. రైతులకు 25 రకాల సేవలు వీటి ద్వారా అందించాలన్నది ప్రభుత్వ నిర్ణయం. ఇందుకు గ్రామాల వారీగా జనాభా, సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య తదితర వివరాలను సేకరించే అంశాలపై అధికారులు దృష్టి సారించారు.

క్లస్టర్ల వారీగా ఏర్పాటు..
జిల్లాలో ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలకు అనుబంధంగా వ్యవసాయ సమూహాలను (క్లస్టర్లు) పరిగణనలోకి తీసుకొని నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 82 క్లస్టర్లు ఉండగా 45 పీఏసీఎస్‌లు ఉన్నాయి. కొత్తగా మరో 37 ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఒకవేళ రెవెన్యూ గ్రామాల ప్రాతిపదికన ఏర్పాటు చేస్తే మరిన్ని సంఘాలు అందుబాటులోకి రానున్నాయి.

విస్తరిస్తున్న సేవలు...
జిల్లాలోని కొన్ని గ్రామాలను కలిపి సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 45 సంఘాలు ఉండగా వీటి పరిధిలో 1,09,890 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో కొన్ని నామ మాత్రంగా ఉండగా, మరికొన్ని సంఘాలు రైతుల అవసరాలకు ప్రాధాన్యమిచ్చి సహకార సేవలందించడంలో ముందుంటున్నాయి. వీటిని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా పలు రకాల రుణ సౌకర్యం కల్పిస్తోంది. రైతులకు పంట రుణాలతో పాటు, రైతులకు కావాల్సిన ఎరువుల విక్రయాలు, విత్తనాల పంపిణీ, ధాన్యం కొనుగోళ్లు వంటివి చేపడుతూ బలోపేతం చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రైతులకు ఇచ్చే పంట రుణాలు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడంలో ముందుంటున్నాయి. సంఘాల పరిధిలో సేవలు పొందాలంటే సహకార సంఘంలో రైతులు సభ్యత్వం తీసుకోవాలి. సభ్యత్వం ఉన్న వారికి ఓటు హక్కు లభిస్తుంది.

ఆదేశాలు రాగానే..



సహకార సంఘాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త సంఘాలకు సంబంధించి మాకు విధి, విధానాలు రాలేదు. సంఘాల ఏర్పాటు జరిగితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వం నిర్ణయంతో జిల్లాలో సంఘాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.
– నామ శ్రీధర్, డీసీఓ, సూర్యాపేట.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని బుధవారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుఫర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణతంతు ముగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్ , ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, , లక్ష్మీనరసింహమూర్తి ,ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే గిరిజనులు అభివృద్ధి సాధించారని పీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మఠంపల్లి మండలం బిల్యానాయక్‌తండాలో గిరిజనుల హోలీ వేడుకల్లో భాగంగా లైటింగ్ ప్రభను ప్రారంభించి మాట్లాడారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలోనే గిరిజనులను ఎస్టీలుగా గుర్తించినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ వేలాది తండాల్లో ఇందిరమ్మ ఇళ్లను, పంటరుణాల మాఫీ చేయడమే గాక రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించామన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనూ తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా వేలకోట్ల రూపాయలతో ఎత్తిపోతల పథకాలు, ఇళ్లు, సబ్‌స్టేషన్లు నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాముల శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, పాలకవీడు ఎంపీపీ భూక్యా గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్‌చైర్మన్ బాబునాయక్, నక్రునాయక్, మోతీలాల్‌నాయక్, అరుణాసైదులు, రామునాయక్, మోతీనాయక్, సర్పంచ్ గోవింద్ నాయక్, సక్రియానాయక్ పాల్గొన్నారు.

మనువాద దాడికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మహిళలపై కేంద్ర ప్రభుత్వ మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.రమ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా సంఘం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. మహిళల హక్కులు, భద్రతపై దాడులు పెరుగుతున్నాయన్నారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ , కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, సురం రేణుక, సంతోషిమాత, జయమ్మ, విజయ, పుష్ప, భద్రమ్మ, గౌరమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారం





అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తరపున మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో మంత్రి సత్యవతి రాథోడ్, మహిళా శిశుసంక్షేమ శాఖ కమిషనర్ భారతిహోళికేరీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బండారు సుజాత, అన్వితారెడ్డి

ఒకే చోట సమగ్ర సమాచారం

- యూడైస్ ప్లస్ పేరుతో పాఠశాలల సమాచార సేకరణ
- కొత్త విధానంలో తప్పులు సరిచేసుకునే వెసులుబాటు
- అవసరాలు తెలిసే అవకాశం
- నిధుల విడుదలకు మార్గం సుగమం




హుజూర్‌నగర్ : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇక నుంచి ఒకే చోట లభించనుంది. దీనిలో భాగంగా 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించిన అన్ని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఏడాది నుంచి యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) పేరుతో దీనిని అమలు చేస్తున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన మొదటి విడత శిక్షణను ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

మొత్తం 1,271 పాఠశాలలు..
జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, వివిధ యాజమాన్యాల కింద మొత్తం కలిపి 1,271 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రాథమిక పాఠశాలలు 710, ప్రాథమికోన్నత పాఠశాలలు 178, ఉన్నత పాఠశాలలు 383 ఉన్నాయి. వాటిలో 1 నుంచి 12 తరగతుల వరకు కలిపిమొత్తం 1,39,184 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కాగా ఈ పాఠశాలలకు సంబంధించిన సమగ్ర వివరాలను చైల్డ్ ఇన్ఫోలోని యూడైస్ ప్లస్ (ఆన్‌లైన్) లో నమోదు చేయనున్నారు.

మరిన్ని వివరాలు జోడించి సమాచార సేకరణ..
జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బాలు, ఆదర్శ పాఠశాలల్లో ఏటా యూడైస్ పేరుతో సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేశారు. దీనికి మరిన్ని వివరాలు జోడించి కొన్ని మార్పులు చేసి సమగ్ర సమాచారం సేకరించనున్నారు. పాఠశాలలో ఉన్న తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సమాచారం మొత్తాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు అన్నింటివి కలిపి ఒకే చోట నమోదు చేస్తారు. పాఠశాలలు మూసివేసినా, ప్రారంభించినా వెనువెంటనే వాటిని నమోదు చేయాల్సి ఉంటుంది. అన్ని వివరాలు ఒకే చోట కనిపిస్తే ఏ పాఠశాలకు ఏమి అవసరం ఉందో కూడా అధికారులు తెలుసుకునే వీలు కలుగుతుంది. ఇది నిధుల విడుదలకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

సమాచారాన్ని బట్టి నిధుల కేటాయింపు



విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు, పాఠశాలలకు సంబంధించిన మౌలిక, ఇతర సదుపాయాలను ప్రాథమిక విద్య నుంచి 12 వ తరగతి వరకు పూర్తి సమాచారాన్ని యూడైస్ ప్లస్‌లో నిక్షిప్తం చేస్తారు. దీని వల్ల విద్యావిషయ సంబంధ పనులు, వనరుల సేకరణకు ఈ సమాచారం పూర్తి స్థాయిలో వినియోగించబడుతుంది. ఈ సమాచారాన్ని బట్టి నిధుల కేటాయింపు ఉంటుంది.
– కె. శ్రవణ్ కుమార్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్, సూర్యాపేట

వివరాల ఆధారంగానే పుస్తకాలు, యూనిఫామ్

యూడైస్‌లో పాఠశాల స్థితిగతులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే వెబ్‌సైట్ (ఆన్‌లైన్)లో నమోదుచేయాలి. దానిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పరిశీలిస్తారు. అక్కడి నుంచి రాష్ట్ర స్థాయికి వివరాలు పంపాక అనేక తప్పులు దొర్లుతున్నాయి. గతంలో అయితే వీటిని సరిచేసుకునే వీలు ఉండేది కాదు. కొత్త విధానం వల్ల తప్పులు ఉంటే వాటిని సరిదిద్దుకోవచ్చు. ఈ ఏడాది నమోదు చేసిన వివరాల ఆధారంగానే 2023–24 విద్యా సంవత్సరానికి పుస్తకాలు, యూనిఫామ్, ఇతర మౌలిక వసతులకు నిధులు అందుతాయి. ఈ విధానం వల్ల జాప్యం లేకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. ఈ విధానం వల్ల అన్ని వివరాలు ఒకే చోట ఉంటాయి. దీంతో నిధులు విడుదల చాలా సులువు అవుతుంది.

క్లుప్తంగా

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

మోత్కూరు: అదుపుతప్పి ఆటో బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలైన సంఘటన మోత్కూరు మండలంలోని అనాజిపురం గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని కాశవాడ కాలనీవాసులు ఆటోలో చౌటుప్పల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా అనాజిపురం గ్రామ శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కమాస్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి మోత్కూరులో ప్రథమ చికిత్స చేయించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు.

యువకుడి హత్య.. ముగ్గురిపై కేసు


మల్లారు శ్రీను (ఫైల్)

ఆలేరురూరల్: మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన మల్లారు శ్రీను(35) మంగళవారం రాత్రి గ్రామ శివారులో హత్యకు గురికాగా, ఈ ఘటనపై మృతుడి తల్లి పెంటమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికే చెందిన వస్పరి రామచంద్రయ్యతో పాటు అతడి స్నేహితులు మల్లారి కనకయ్య, కుడుదుల నవీన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ ఇద్రీస్ అలీ తెలిపారు.

ప్రమాదవశాత్తు వస్త్ర దుకాణం దగ్ధం


దగ్ధమైన వస్త్ర దుకాణం

నల్లగొండ క్రైం : ప్రమాదవశాత్తు వస్త్ర దుకాణం దగ్ధమైన సంఘటన బుధవారం నల్లగొండ పట్టణంలోని రామగిరి రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలు.. రామగిరి రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెంట కొంతకాలంగా సీహెచ్. నర్సింహ అనే వ్యక్తి ఓ చిన్న డబ్బా ఏర్పాటు చేసుకుని వస్త్ర దుకాణం నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా బుధవారం పక్కనే ఉన్న ఆర్టీఓ కార్యాలయం ప్రహరీ వెంట గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పుపెట్టడంతో ఆ మంటలు వస్త్ర దుకాణా నికి అంటుకుని దగ్ధమయ్యింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.2లక్షల విలువైన దుస్తులు దగ్ధమయ్యాయని, ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

నేరాలపై తక్షణమే స్పందించాలి

మోత్కూరు: సమాజంలో జరిగే నేరాలపై తక్షణమే స్పందిస్తే తగిన ఆధారాలు లభిస్తాయని డీసీపీ రాజేష్‌చంద్ర అన్నారు. మోత్కూరు పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల నేరాల నమోదును ఆయన పరిశీలించారు. నేరాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలో సిబ్బందికి పలు సూచనలతో అవగాహన కల్పించారు. హత్యలు జరిగినప్పుడు ఏ రకమైన ఆధారాలు సేకరించాలో, సమష్టి గొడవలు, ఘర్షణలు జరిగినప్పుడు ఏ రకంగా స్పందించాలో డీసీపీ వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మోత్కూరు పోలీస్ స్టేషన్‌కు అన్ని సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. మోత్కూరు సర్కిల్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట రామన్నపేట సీఐ మోతీరామ్‌నాయక్, స్థానిక ఎస్‌ఐ వంగాల జానకిరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

నకిలీ బంగారంతో మోసాలు

- రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.3.30లక్షల నగదు, 3కిలోల నకిలీ బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్


కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్, వెనకాల నిందితులు

సూర్యాపేట క్రైం: నకిలీ బంగారాన్ని అసలు బంగారం అని చెప్పి ప్రజలకు అంటగడుతూ మోసాలకు పాల్పడుతున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలను తుంగతుర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చామర గ్రామానికి చెందిన గంజి పద్మ అలియాస్ పెద్దింటమ్మ అలియాస్ జయమ్మ, కుంచాల శ్రీను, బత్తుల విజయ్ 20 రోజుల క్రితం తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో సోమయ్య అనే వ్యక్తి ఇంట్లో గది అద్దెకు తీసుకొని తాపీ పనిచేస్తున్నామని నమ్మించారు. కాగా ఫిబ్రవరి 21న పద్మ, విజయ్ ఇద్దరూ భార్యాభర్తల మాదిరిగా బైక్‌పై మద్దిరాల మండల కేంద్రానికి వెళ్లి అక్కడ సైదులు అనే వ్యక్తికి మాయమాటలు చెప్పి నకిలీ బంగారం ఇచ్చి అసలు బంగారం అని నమ్మించి సైదులు భార్య మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును దొంగిలించారు. మరలా ఫిబ్రవరి 24న పద్మ, విజయ్ ఇద్దరూ అక్కాతమ్ముడు మాదిరిగా బైక్‌పై వెలుగుపల్లి గ్రామంలో తూము లక్ష్మి ఇంటికి వెళ్లి నకిలీ బంగారం బిల్లలు ఇచ్చి ఆమెకు అసలు బంగారం అని మాయమాటలు చెప్పి రూ.1.8లక్షలు తీసుకొని వెళ్లారు. అదేవిధంగా మార్చి 6న పద్మ, కుంచాల శ్రీను ఇద్దరూ బైక్‌పై అర్వపల్లి మండలం గొల్లపల్లి గ్రామ శివారులో 365వ నంబర్ జాతీయ రహదారిపై పండ్లు విక్రయిస్తున్న వీరమ్మకు మాయమాటలు చెప్పి ఆమెకు నకిలీ బంగారం అంటగట్టి ఆమె వద్ద రూ.50వేలు తీసుకొని వెళ్లిపోయారు. తమకు నకిలీ బంగారం అంటగట్టారని గుర్తించిన బాధితులు మద్దిరాల, అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం తుంగతుర్తి పట్టణంలో స్థానిక ఎస్‌ఐ డానియల్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అన్నారం గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు నిజం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ.2.30లక్షల నగదు, 500గ్రాముల నకిలీ బంగారం, మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మరో ముఠా గుట్టురట్టు..

అదేవిధంగా మంగళవారం తుంగతుర్తి పట్టణ కేంద్రంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వెలుగుపల్లి గ్రామానికి వెళ్లే ఆర్చి వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం పచ్చిరాజపురం గ్రామానికి చెందిన నక్క మత్తయ్య, డబ్బా యాకోబుగా గుర్తించారు. వీరు కూడా ఆరు నెలల క్రితం తుంగతుర్తి మండల కేంద్రానికి వచ్చి స్థానికంగా నివాసముంటూ నకిలీ బంగారం అమాయకులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారని, వారం రోజులుగా నకిలీ బంగారం గొలుసు తమ దగ్గర పెట్టుకుని దానిని అసలు బంగారం అని నమ్మించి డబ్బులు వసూలు చేసేందుకు తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా ఆరు నెలల క్రితం తుంగతుర్తి మండలంలోని ఏనేకుంట తండాకు చెందిన సపావత్ వెంకన్నను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి పిలిపించుకొని అతని వద్ద రూ.5లక్షల నగదు తీసుకొని నకిలీ బంగారు గొలుసు ఇచ్చినట్లు విచారణలో అంగీకరించారు. వీరికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన మహేష్ అనే వ్యక్తి కూడా సహకరించినట్లు ఒప్పుకున్నారు. పోలీసులు ఈ ఇద్దరు నిందితుల నుంచి రూ.లక్ష నగదు, రెండున్నర కిలోల నకిలీ బంగారం గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు మహేష్ పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ రెండు కేసులను ఛేదించిన సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, తుంగతుర్తి ఎస్‌ఐ డానియల్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ నాగభూషణం, సీఐ నాగార్జున, ఎస్‌ఐ డానియల్ పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

- బీజేవైఎం మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న రవీందర్‌గౌడ్


రవీందర్‌గౌడ్ మృతదేహం

ఆత్మకూరు(ఎం): మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన బీజేవైఎం మండల అధ్యక్షుడు, గీత కార్మికుడు పొనగాని రవీందర్‌గౌడ్(35) బుధవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరా ప్రకారం.. రవీందర్‌గౌడ్ బుధవారం ఉదయం తన వ్యవసాయ భూమిలో కల్లు తీయడానికి తాటిచెట్టు ఎక్కగా, మోకు జారడంతో కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, పార్టీ రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, సూదగాని హరిశంకర్‌గౌడ్‌లు రవీందర్‌గౌడ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో గ్రామ సర్పంచ్ దయ్యాల రాజు, రైతు సమితి కోఆర్డినేటర్ చిక్కిరి రవి, బీజేపీ మండల అధ్యక్షుడు తడిసిన మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, రావుల నరేందర్, మండల ప్రధాన కార్యదర్శి నాతి భిక్షపతి, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు బీసు చందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, గౌడ సంఘం నాయకులు పంజాల వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

ప్రభుత్వాస్పత్రిలో నవజాత శిశువు మృతి

నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతిచెందగా, వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బుధవారం కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వివరాలు.. పెద్దవూర మండలంలోని చలకుర్తికి చెందిన ప్రతిభ రెండు రోజుల క్రితం నల్లగొండ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించింది. శిశువు బరువు తక్కువగా ఉండడంతో పాటు ఇతర కారణాలతో బుధవారం మృతిచెందినట్లు వైద్య అధికారి వందన తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతిచెందిందని బంధువులు ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు.

మహిళను వేధించిన పాత్రికేయుడు

- మాచర్ల విలేకరిపై మిర్యాలగూడలో కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: అతనో ప్రతికా విలేకరి. తాను పనిచేసే పత్రిక పేరు అడ్డుపెట్టుకుని చేయని అక్రమాలు లేవు. చివరకు ఓ మహిళను లైంగికంగా వేధించడంతో ఆమె మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. మాచర్లలో పెద్ద పత్రిక విలేకరిని అని అక్కడే ఓ బ్యాంకు అధికారి భార్యకు దగ్గరయ్యాడు. నీ తమ్ముడికి ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఆమె వద్ద నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. అలా ఆమె ఆస్తిని దక్కించుకునేందుకు పన్నాగం పన్నాడు. ఎంతకీ తన తమ్ముడికి ఉద్యోగం రాకపోవడం, డబ్బులు తీసుకోవడమే కానీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో సదరు మహిళ అతడిని ప్రశ్నించింది. దీంతో ఆ మహిళను మానసికంగా, శారీరకంగా హింసించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో ఆ మహిళ భర్తకు మాచర్ల నుంచి నల్లగొండకు బదిలీ కావడంతో వారు నల్లగొండకు వచ్చారు. అయినా ఆ విలేకరి నల్లగొండకు వచ్చి ఆమెను వేధిస్తుండేవాడు. తర్వాత ఆమె భర్తకు సూర్యాపేటకు బదిలీ అయ్యింది. కుటుంబంతో మిర్యాలగూడలో నివాసముంటూ సూర్యాపేటకు విధులకు వెళ్లి వస్తున్నాడు. అయితే, ఆ విలేకరి మిర్యాలగూడకు కూడా వచ్చి ఆమెను వేధిస్తుండడంతో విసుగు చెందిన ఆ మహిళ మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడి బారి నుంచి కాపాడమని ప్రాధేయపడడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే సదరు విలేకరి తన పలుకుబడి ఉపయోగించుకుని ఆ మహిళ తనకు డబ్బులు బాకీ ఉందని తప్పుడు కేసు పెట్టాడు. సదరు విలేకరి గతంలోనూ అనేక అక్రమాలకు పాల్పడ్డాడనే ఆరోపణలు ఉన్నాయి. అయితే అతడు ఓ పెద్ద పత్రికలో విలేకరి కావడంతో అతడిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళపై వేధింపులకు పాల్పడిన ఆ విలేకరిపై పోలీసులు చర్యలు తీసుకుంటారా..? లేక ఆ మహిళ అతడి వేధింపులకు బలి కావాల్సిందేనా..? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వివాహితపై లైంగిక వేధింపులు

- కేసు పెడితే చంపుతానంటూ కత్తితో బెదిరించిన వ్యక్తి అరెస్ట్
- రిమాండ్‌కు తరలింపు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ

మిర్యాలగూడ టౌన్: వివాహితను లైంగిక వేధించడంతో పాటు కేసు పెడితే చంపుతానంటూ కత్తి పట్టుకొని తిరుగుతున్న వ్యక్తిని మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం రాత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ విలేకరులకు వివరాలను వెల్లడించారు. వివరాలు.. మిర్యాలగూడ మండలం కిష్టపురం గ్రామానికి చెందిన వివాహిత మంగళవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా ఆదే గ్రామానికి చెందిన జక్కా రాంబాబు లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని గుర్తించిన కొంతమంది మహిళలు రాంబాబును పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయాడు. మహిళలందరూ కలిసి సదరు వివాహితను ఇంటికి తీసుకెళ్తుండగా.. తనపై కేసు పెడుతారని భావించిన రాంబాబు కత్తిని తీసుకొచ్చి వచ్చి ఆ మహిళలను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు బుధవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు వెంటనే నిందితుడిని పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా బుధవారం దామరచర్ల మండలం వాడపల్లికి వచ్చిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావుకు రూరల్ పోలీసులు ఈ విషయాన్ని తెలియజేశారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ.. మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అన్ని ప్రాంతాల్లో షీటీం నిఘాను పటిష్ఠం చేసినట్లు తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే డయల్ 100కు లేదా షీటీం, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సాగర్ కాలువలో యువకుడు గల్లంతు


అజయ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్: నాగార్జునసాగర్ ఎడమ కాలువలో యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. అనుముల మండల కేంద్రానికి చెందిన ఆవులదొడ్డి సైదయ్య, రమణ దంపతులకు ఇద్దరు కుమారులు. సైదయ్య 10 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో రమణ తన ఇద్దరు పిల్లల చదువుల కోసం అనుముల నుంచి వచ్చి వలస వచ్చి మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డికుంటలో నివాసముంటుంది. రమణ ఓ బట్టల దుకాణంలో పనిచేస్తూ కుమారులను చదివిస్తుంది. పెద్ద కుమారుడు అజయ్‌కుమార్(20) ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం స్నేహితులతో కలిసి హోలీ ఆడిన అజయ్‌కుమార్ స్నానం చేసేందుకు మండలం పరిధిలోని చిల్లాపురం వద్ద గల సాగర్ ఎడమ కాలువ వద్దకు వెళ్లాడు. అజయ్‌కుమార్‌కు ఈత రాకపోవడంతో కాలువ గట్టు వెంట మెట్లపై కూర్చొని స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కాలువలో పడిపోయాడు. అజయ్‌కుమార్‌తో వెళ్లిన స్నేహితులు ఎవరికీ కూడా ఈత రాకపోవడంతో తమ మిత్రుడు నీటిలో మునిగిపోతున్నా కాపాడలేకపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎన్ఎస్‌పీ అధికారులతో మాట్లాడి కాలువకు నీటిని బంద్ చేయించి అజయ్‌కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. బుధవారం కూడా కాలువ వెంట వెతికినా ఆచూకీ దొరలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనారోగ్యానికి గురైన నక్కకు చికిత్స


నక్కకు చికిత్స చేయిస్తున్న ఫారెస్ట్ అధికారులు

నార్కట్‌పల్లి: మండలంలోని పోతినేనిపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి బుధవారం తన వ్యవసాయ బావి వద్ద ఓ నక్క అనారోగ్యంతో ఉండటం గమనించి వెంటనే చిట్యాల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నర్సింహ, నార్కట్‌పల్లి బీట్ ఆఫీసర్ భవానీకి సమాచారం అందించాడు. ఫారెస్ట్ అధికారులు గోపాలమిత్ర రమేష్‌ను పిలిపించి నక్కకు అక్కడే వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు వారి వెంట నక్కను తీసుకెళ్లారు.

కుటుంబ కలహాలతో విద్యార్థి ఆత్మహత్య


హరీష్ (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన విద్యార్థి మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని వద్దిపట్ల గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వద్దిపట్ల గ్రామానికి చెందిన కుంటిగోర్ల వెంకటయ్య, పద్మ దంపతులు తమకున్న ఆరెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు అనిల్ నల్లగొండలోనే ఉంటూ అక్కడే డిగ్రీ చదువుతున్నాడు. చిన్న కుమారుడు హరీష్(18)మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ రోజూ ఇంటి దగ్గర నుంచే వెళ్లి వస్తున్నాడు. అయితే శనగ పంటకు నీరు పెట్టే విషయమై మంగళవారం రాత్రి వెంకటయ్య, పద్మ గొడవపడ్డారు. ఇది గమనించిన హరీష్ తన తల్లిదండ్రులు తరచూ ఏదో ఒక విషయమై గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి బయటకు వచ్చి నల్ల గొండలో ఉంటున్న తన అన్న అనిల్‌కు ఫోన్ చేసి తనకు బతకాలని లేదని, ఇంటి వద్ద ఉండాలని అనిపించడం లేదని చెప్పి ఫోన్ కట్ చేశాడు. అనంతరం గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు పైకి ఎక్కి అక్కడి నుంచి దూకి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. అనిల్ ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు హరీష్ కోసం వెతుకుతుండగా మిషన్ భగీరథ ట్యాంకు వద్ద మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణం మీదకు తెచ్చిన సీసీ రోడ్డు పంచాయితీ

కోదాడరూరల్ : సీసీ రోడ్డు పంచాయతీ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. వివరాలు.. మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన శెట్టి రామకృష్ణ ఇంటి వద్ద ఎక్కువ వెడల్పుగా రోడ్డు వేస్తుండగా అతడు పనులను అడ్డుకున్నాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి జీవిత పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రామకృష్ణ పురుగుల మందు తాగాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని మొదట కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు అక్కడి నుంచి సూర్యాపేటకు తరలించారు. రోడ్డు వేసే విషయమై గ్రామ సర్పంచ్, కార్యదర్శి తమను ఇబ్బందులకు గురిచేశారని పోలీస్ స్టేషన్‌లో బాధితుఇ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని రామకృష్ణపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

మోత్కూరులో డాక్యుమెంట్ రైటర్ల నిరసన

మోత్కూరు : మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్ తమ పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని ఐదుగురు డాక్యుమెంట్ రైటర్లు మూడు రోజుల బంద్‌లో భాగంగా బుధవారం తమ దుకాణాలను మూసేసి నిరసనకు దిగారు. ఇటీవల డాక్యుమెంటేషన్ తీసుకెళ్లిన ఓ డాక్యుమెంట్ రైటర్ ముఖంపై విసిరి కొట్టడంతో పాటు ఆ వివాదం పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. సబ్ రిజిస్ట్రార్ బి.సురేందర్‌నాయక్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో స్థానికంగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఇర్షాద్‌కు తాత్కాలికంగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించారు. బంద్‌తో కేవలం ఒకే ఒక మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేశామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో అపశృతి

- అదుపుతప్పి బోల్తా పడిన క్రేన్
- విరిగిన ధ్వజ స్తంభం, ఒకరికి గాయాలు


బోల్తాపడిన క్రేన్, పక్కనే విరిగిన ధ్వజస్తంభం

మద్దిరాల: మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు భారీ క్రేన్‌లతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించేందుకు లేపుతుండగా అందులో ఒక క్రేన్‌పై మొత్తం భారం పడి ఒక్కసారిగా బోల్తాపడింది. దీంతో ధ్వజస్తంభం రెండు ముక్కలుగా విరిగి కిందపడింది. రెడ్డిగూడెంలో తమ బంధువుల ఇంటికి వచ్చిన నూతనకల్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన మాదసు ముత్తయ్యపై క్రేన్ పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా అంతకు ముందే పోలీసులు ధ్వజస్తంభానికి చుట్టూ ఉన్న వారిని దూరంగా పంపించడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

హామీలు అమలు చేసేవరకు ఉద్యమిస్తాం


మునుగోడులో పాదయాత్రని ప్రారంభిస్తున్న వీఆర్‌ఏలు

మునుగోడు : వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని తెలంగాణ రాష్ట్ర వీఆర్‌ఏల హక్కుల సాధన చైర్మన్ ఆర్.విజయ్ స్పష్టం చేశారు. బుధవారం మునుగోడు నుంచి యాదగిరిగుట్ట వరకు వీఆర్‌ఏలు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో కొత్త రెవెన్యూ చట్టం తీసుకొచ్చిన సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలకు పేస్కేలు అందించడంతో పాటు అర్హులైనవారికి ప్రమోషన్లు ఇస్తామని హామీలు ఇచ్చి ఇప్పటివరకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గతేడాది మూడు నెలల పాటు నివరధిక సమ్మె చేస్తే సమ్మె కాలంలో వేతనాలు అందక, కుటుంబాలు గడవక 70 మందికి పైగా వీఆర్‌ఏలు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో వీఆర్‌ఏల డిమాండ్లను నెరవేరుస్తామని.. సీఎం కేసీఆర్ చెప్పారని.. ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. అందుకే మునుగోడు నుంచి పాదయాత్ర మొదలు పెట్టామన్నారు. యాదగిరిగుట్టలో ఈ నెల 12న రాష్ట్రస్థాయి భారీ బహిరంగ సభని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబాల శ్రీధర్‌గౌడ్, చల్లా లింగరాజు, నర్సింహారావు, లక్ష్మీనారాయణ, కె.సత్యనారాయణ, నార్ల శ్రీనివాస్, మాదాం చిరంజీవి, ఆరుట్ల బాలయ్య, మాధవీగౌడ్, రాజలింగం, జ్యోతి, మల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

- నల్లగొండ ఎస్పీ అపూర్వరావు
- షీటీం ఆధ్వర్యంలో 3.2కే రన్


3.2 కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని నల్లగొండ ఎస్పీ అపూర్వ రావు ఆకాంక్షించారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నల్లగొండ పట్టణంలో షీటీం ఆధ్వర్యంలో 3.2కే రన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. ఆకాశమే హద్దుగా మహిళలు రాణించడం శుభపరిణామమన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం షీటీంలను ఏర్పాటు చేసిందని తెలిపారు. పోలీస్ పరంగా భద్రత, భరోసా కల్పించేందుకు జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రం ఉందన్నారు. మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలు జరిగినా వెంటనే భరోసా కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. మహిళలు పనిచేసే చోట, విద్యాసంస్థల్లో, సామాజిక మాధ్యమాల్లో ఎక్కడ ఇబ్బంది కలిగించినా.. స్థానిక పోలీసులకు, షీటీం బృందాలకు, 100 నంబర్‌కు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాద్ రావు, డీఎస్పీలు నర్సింహారెడ్డి, సురేష్, షీ టీం సీఐ రాజశేఖర్‌గౌడ్, సీఐ గోపి, చంద్రశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, ఆర్‌ఐలు నర్సింహాచారి, స్పర్జన్‌రాజు, శ్రీను, సంతోస్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

మహిళల ప్రాతినిధ్యం పెరిగింది..

పోలీస్ శాఖలో మహిళ ప్రాతినిధ్యం పెరుగుతుండడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె కేక్ కట్ చేసి మాట్లాడారు. మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే శాఖాపరంగా సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు కవిత, శ్రావణి, నాగమణి, ఉమ, రేణుక, ఆమని ఉన్నారు.